క్లుప్తంగా

నిరుపేద మహిళకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న సీఐ బన్సిలాల్

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని గంగారోడ్‌కు చెందిన చంద్రయ్య(45) మద్యానికి బానిసై అనారోగ్యంతో మృతిచెందాడు. లక్ష్మి తన ముగ్గురు చిన్న పిల్లలతో కలిసి సోదరి ఇంట్లో కాలం వెళ్లదీస్తోంది. పిల్లల పోషణ భారంతో ఇబ్బంది పడుతోంది. శుక్రవారం ఐబీ చౌరస్తా వద్ద పిల్లలకు అంబలి తాగించి ఆకలి తీరుస్తుంది. విషయం తెలుసుకున్న సీఐ బన్సిలాల్ స్పందించి లక్ష్మికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. స్థానికులు, అధికారులు సీఐని అభినందించారు.

ప్రజావ్యతిరేక విధానాలు వీడాలి

నెన్నెల: ప్రభుత్వాలు రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి లాల్‌కుమర్, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గుండ్ల సోమారంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రత్నం తిరుపతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దేశంలో మోదీ ప్రభుత్వం కులమతాలకు అడ్డుపెట్టుకుని ప్రజలను రెచ్చగొడుతూ విధ్వంసాలు సృష్టిస్తుందన్నారు. అనంతరం నూతన రైతు కూలీ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏఐకేఎంఎస్ నెన్నెల నూతన అధ్యక్షుడిగా దుర్గం గంగరాజు, దాగం రాజు, ఉపాధ్యక్షులుగా జాగటి వెంకటేశ్, కార్యదర్శిగా దుగుట రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎస్.డి.అఫ్రిన్ ఎన్నికయ్యారు. మొత్తం 21 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏఐకేఎంఎస్, పీడీఎస్‌యూ, అరుణోదయ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

'మోదీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికే ప్రమాదం'

జన్నారం: నరేంద్రమోదీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదం పొంచి ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఖలిందర్ అలీఖాన్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. మోదీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చడం ఖాయమన్నారు. సాక్షాత్తు మంత్రులు ఈ విషయంపై పలుమార్లు చెప్పారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ వామపక్ష కూటమి సంయుక్తంగా బీజేపీపై పోరాటం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, మండల ఎన్నికల ఇన్‌చార్జి రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, నాయకులు సయ్యద్ ఇసాక్, సుధాకర్‌నాయక్, లక్ష్మీనారాయణ, సుధీర్‌కుమార్, నందునాయక్, సీపీఐ కార్యదర్శి దాసరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

దండేపల్లి: బీజేపీ నేత, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు యశ్వంత్‌నాయక్ శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన ఆయనకు జిల్లా నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు కండువా కప్పారు. వైస్ ఎంపీపీ అనిల్, పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరామర్శ

జైపూర్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంబల్ల రవీందర్‌రెడ్డి తల్లి అమృత ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆ కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గడ్డం వివేక్ పరామర్శించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి, మామడ, కేతన్‌పల్లి, గొర్లపల్లి, కాటేపల్లి, జాజులపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీవో బాపురావు, సెక్టోరల్ అధికారి నరేశ్ శుక్రవారం పరిశీలించారు. వసతులపై ఆరా తీశారు. పోలింగ్ అధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, సిరాజ్, అశోక్, జాఫర్ ఉన్నారు.



తపాలా కార్యాలయం



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం



బీసీ హాస్టల్

అద్దె భవనాల్లో.. అరకొర వసతులు

దండేపల్లి: మండల కేంద్రంలోని తపాలా కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంతోపాటు, బీసీ బాలుర వసతి గృహం, గ్రంథాలయానికి పక్కా భవనాలు లేవు. దీంతో వాటిని కొన్నేళ్లుగా అద్దె ఇళ్లల్లో కొనసాగిస్తున్నారు. వసతులు అంతంతా మాత్రంగానే ఉన్నాయి. ఏళ్ల తరబడి పక్కా భవనాలు నిర్మించకుండా వేలకు వేలు అద్దెచెల్లిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇవే కాకుండా మండలంలో 66 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో కేవలం 3 కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. 43 కేంద్రాలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సర్దుబాటు చేసి నిర్వహిస్తున్నారు. 20 కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

తప్పులు జరిగితే ఉపేక్షించేది లేదు

- అదనపు డీఆర్‌డీవో దత్తారావు
- 3వ విడత సామజిక తనిఖీ ప్రజావేదిక



మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీవో దత్తారావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా ఇకపై ఎలాంటి తప్పులు జరిగినా ఉపేక్షించేది లేదని అదనపు డీఆర్‌డీఓ దత్తారావు తెలిపారు. హాజీపూర్ ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం 3వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 17 పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు ఈజీఎస్ పరిధిలో చేపట్టిన 350 పనులకు సంబంధించి రూ.2.39 కోట్ల విలువ గల అభివృద్ధి పనులను తనిఖీ బృందాలు రికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షించారు. ప్రజావేదికలో పలు అంశాలపై కార్యదర్శులు, ఈజీఎస్, సామాజిక తనిఖీ సిబ్బంది చర్చించారు. ఈజీఎస్ పనుల నిర్వహణలో అక్కడక్కడ జరిగిన తప్పులు, కొన్ని నిధుల దుర్వినియోగాన్ని గుర్తించారు. ఇక అధికారులు కూడా జరిగిన తప్పులకు సంబంధించి, పక్కదోవ పట్టిన నిధులను రికవరీ చేయాలన్నారు. పనుల విషయంలో కొలతలు, రికార్డుల విషయంలో లోపాలు, ఉపాధి పనులు తప్పుల తడకగా జరిగాయని పేర్కొంటూ తనిఖీ బృందాలు అధికారుల సమక్షంలో తేల్చిచెప్పాయి. అదనపు డీఆర్‌డీఓ మాట్లాడుతూ తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. అర్హులకు జాబ్ కార్డులు అందేలా చూస్తూ పని కల్పించాలన్నారు. ఎంపీడీవో మధుసూదన్, తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఎంపీవో శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తీర్చేది కాంగ్రెస్సే



బెల్లంపల్లిరూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్



రామకృష్ణాపూర్: మాట్లాడుతున్న వంశీకృష్ణ

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లిరూరల్: ప్రజల కష్టాలు తీర్చగలిగేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కోరారు. మండలంలోని బుధాకుర్దు పంచాయతీలో ఉపాధి కూలీలతో శుక్రవారం సమావేశమై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో కలిసి అల్పాహారం ఆరగించారు. వినోద్ మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీ రూ.400లకు పెంచుతుందన్నారు. పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి, మండల అధ్యక్షుడు సింగతి సత్యనారాయణ పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: సుద్దాల, గంగారం గ్రామాల్లో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ శుక్రవారం ప్రచారం చేపట్టారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, నాయకులు దుర్గం నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపించాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు కోరారు. శుక్రవారం ఆయన ఆర్కే 5 గనిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యూనియన్ జాతీయ సమితి సభ్యుడు భీంరావు, కేంద్ర నాయకులు స్వామి, శ్యామ్ పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి, పాడేటి రవి, ఉస్కమల్ల పున్నం చందు, బుక్యా లక్ష్మణ్, ఉస్కమల్ల శ్రీనివాస్, తిరుపతి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బెల్లంపల్లి: కాంటా, బజారు ఏరియా ప్రాంతంలో శుక్రవారం మున్సిపల్ కౌన్సిలర్లు ఎన్నికల ప్రచారం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రామునాయక్, కౌన్సిలర్లు సురేష్, మధు, చంద్రశేఖర్, షేక్ అఫ్సర్, రాజలింగు, కాంగ్రెస్ నాయకులు మధు, ఎలిగేటి శ్రీనివాస్, బానేష్, కె.శ్రీనివాస్, శంకర్‌సింగ్, పి.శ్రీనివాస్, నరేందర్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలో శుక్రవారం కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు. ఉపాధి కూలీల సమస్యలు ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీని రూ.400 చేస్తామని పేర్కొన్నారు.

వేమనపల్లి: చామనపల్లి, బొమ్మెన, కేతన్‌పల్లి గ్రామాల్లో ఎంపీటీసీ సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ గాలి మధు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి'



బెల్లంపల్లిరూరల్: మాలగురిజాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

బెల్లంపల్లిరూరల్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి తెలిపారు. మండలంలోని మాలగురిజాల పంచాయతీలో పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ సతీమణి గీతతో కలిసి శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న మోదీ పాలనలోనే దేశం భద్రంగా ఉంటుందన్నారు. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి మూడోసారి మోదీని ప్రధానిగా పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కాక కుటుంబం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, ఎస్టీ మోర్చా పార్లమెంట్ కన్వీనర్ శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కమల, నాయకులు కేశవ రెడ్డి, రాజులాల్ యాదవ్, ప్రకాశ్, గంగారాం, నర్సింగ్, సంగీత, గౌతమి పాల్గొన్నారు.

కోటపల్లి: బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కోరారు. శుక్రవారం సిర్సా గ్రామంలో ఎన్నికల ప్రచారం పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ పెద్దింటి పున్నంచంద్‌కు కాషాయ కండువా కప్పారు. జిల్లా కన్వీనర్ దుర్గం ఆశోక్, మండల అధ్యక్షుడు రామయ్య, నాగేశ్వర్‌రావు, తిరుపతి పాల్గొన్నారు.

వేమనపల్లి: జాజులపేటలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు సుధాకర్, పుల్లయ్య, లస్మయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థినే గెలిపించాలి

చెన్నూర్: బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ గెలిపించాలని నేతకాని హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యేస్కురి రాజమల్లు కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో 2.50 లక్షల నేతకాని కులస్తుల ఓట్లు ఉన్నాయని తెలిపారు. నేతకానిలంతా ఏకమై గోమాస శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలుపించాలని కోరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం ఎల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంటెంకి శేఖర్, రాష్ట్ర కార్యదర్శి దాగం సోమయ్య, నాయకులు జాడి ప్రమోద్, దుర్గం కిష్టయ్య పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: కాచన్‌పల్లిలో శుక్రవారం బీజేపీ నేతలు ప్రచారం నిర్వహించారు. గడప, గడపకూ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు.

జన్నారం: పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరుతూ మురిమడుగు, బాదంపల్లి గ్రామాల్లో ఉపాధి పనుల వద్దకు వెళ్లి బీజేపీ గిరిజన మోర్చా పార్లమెంట్ కన్వీనర్ రితీశ్ రాథోడ్, మండల అధ్యక్షుడు మధుసుదన్‌రావు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, జిల్లా కార్యదర్శి శంకరయ్య, నాయకులు భీమేశ్, గోపాల్, లక్ష్మిరాజం ఉన్నారు.

కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న దివాకర్‌రావు

శ్రీరాంపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కోరారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ కృష్ణ కాలనీలో ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాయన్నారు. ప్రజలను అనేక హామీలతో కాంగ్రెస్ నమ్మించి ఓట్లేయించుకొని మోసం చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల పేరుతో చిచ్చు పెడుతుందన్నారు. పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యదర్శి పవన్ కుమార్, కౌన్సిలర్ గంగ, తిరుపతి పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: ఆస్నాద, దుగ్నెపల్లి, కిష్టంపేట గ్రామాల్లో బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేపట్టారు.

మందమర్రిరూరల్: కొప్పుల ఈశ్వర్‌ను గెలిపిస్తే కార్మికులు పార్లమెంట్‌కు వెళ్లినట్లేనని టీబీజీకేఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ అన్నారు. కేకే–5 గనిపై ఎన్నికల ప్రచారంలో భాగంగా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, నాయకులు శంకర్, అబ్బాస్, రాజశేఖర్, సంపత్, సదానందం, రాంవేణు ఉన్నారు.

జైపూర్: ఇందారంలో వైస్ ఎంపీపీ రమేశ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. బెజ్జాల గ్రామానికి చెందిన పలువురు యువకులు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలి

మందమర్రిరూరల్: ఇండియా కూటమి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ కోరారు. ఏరియాలోని యూనియన్ ఆఫీస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు సమావేశంలో మాట్లాడారు. నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, మల్లేశ్, సంపత్, లక్ష్మీనారాయణ, ఆనయ్య, తిరుపతి, రాజేశం, దినేష్ ఉన్నారు.

బీఎస్పీ అభ్యర్థిని గెలిపించండి

చెన్నూర్: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడే బీఎస్పీ అభ్యర్థి ఇరుకుల్ల రాజనర్సయ్యను గెలిపించాలని ఆ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి రాదాశి రవీందర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజనర్సయ్యను గెలిపిస్తే పెద్దపల్లి అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. బీఎస్పీ జిల్లా నాయకులు చంద్రగిరి శంకర్, మడిపల్లి రాములు, గుమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్‌లో చేరిక

నెన్నెల: గంగారాం గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర నేతకాని మహర్ సంక్షేమ సంఘం జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు గట్టు మల్లేశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో ఆయనకు కండువా కప్పారు. శ్రీనివాస్‌తోపాటు గంగారాం వార్డు సభ్యులు, మరో 20 మంది యువకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

జైపూర్: పద్మశాలి సంఘం మండల అధ్యక్షురాలు ఆవిడపు అనిత శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు మారుతి, గణేశ్ ఆధ్వర్యంలో గ్రామాల పద్మశాలి సంఘం నాయకులు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో చేరగా ఎమ్మెల్యే వివేక్ కండువా కప్పారు. అదేవిధంగా కుందారం,శివ్వారం,మిట్టపల్లి, ఇందారంతో పాటు గ్రామాల్లో కాంగ్రెస్‌నేతలు ప్రచారం చేశారు.

సోషల్ మీడియా ఇన్‌చార్జిగా శివకుమార్

జైపూర్: ఇందారం గ్రామానికి చెందిన ఆసంపల్లి శివకుమార్‌ను కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా నియమించారు. ఎమ్మెల్యే వివేక్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఉన్నారు.

రక్తదానం

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయం వృద్ధాశ్రమం నిర్వాహకులు సదానందం సతీమణి తిరుమల జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు, మిత్రులు పది మంది శుక్రవారం రక్తదానం చేశారు. రక్తనిధి కేంద్ర ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, రవీందర్, విజయ్ కుమార్, సాయిలక్ష్మి, రేఖ, ప్రేమ్ కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

భీమారం: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని చెన్నూరు ఏడీఏ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుంచి అకాల వర్షాల కారణంగా గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే లైన్లపై చెట్లు పడటంతోపాటు ఇన్సులేటర్లు పగిలిపోయాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

బీజేపీలో చేరిక

మంచిర్యాలటౌన్/చెన్నూర్: లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, హాజీపూర్ మండలం వేంపల్లికి చెందిన మహిళలు, చెన్నూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ రాజేష్, నాయకులు శుక్రవారం బీజేపీలో చేరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వారికి కండువాలు కప్పారు. చెన్నూర్ చేరికల కమిటీ సభ్యులు సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, పట్టణ అధ్యక్షుడు తిరుపతి, శ్రీనివాస్, శివ ఉన్నారు.